క్లుప్తంగా

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల: నాయీ బ్రాహ్మణులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవాలయాల పాలకమండలిలో సభ్యులుగా 610 మందిని నియమించగా మంగళవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణులు రాజు శివ, లక్ష్మణ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాల్లో పురోగతి పెంచాలి

యద్దనపూడి: సచివాలయాల పరిధిలో మంజూరైన గృహ నిర్మాణాల్లో ప్రతివారం పురోగతి కనిపించాలని ఎంపీడీఓ కృష్ణకుమారి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న గృహనిర్మాణాలు, సచివాలయాలు, రైతుభరోసా, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవన నిర్మాణాలకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పదిరోజుల్లోపు మంజూరైన అన్ని గృహాల్లో బేస్‌మెంట్ స్థాయికి తీసుకురావాలని మరో 20 రోజులలోపు శ్లాబు స్థాయి గృహాలు పూర్తయ్యేలా అధికారులు లబిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం వెంకట్రావు, ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ దిమ్మెను ఢీకొన్న డీసీఎం

మేదరమెట్ల: డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన డీసీఎం వ్యాన్ సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. ఈ ఘటన పీ.గుడిపాడు జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు విజయవాడ నుంచి కేరళ రాష్ట్రానికి వెళ్తున్న డీసీఎం వ్యాన్ కొరిశపాడు మండలం పీ.గుడిపాడు సమీపానికి రాగానే డ్రైవర్ దుర్గారావు నిద్రమత్తులోకి జారుకోవడంతో వ్యాన్ అదుపు తప్పి డివైడర్ కోసం ఉంచిన సిమెంట్ దిమ్మెలను ఢీ కొంది. ఈ ప్రమాదంలో దుర్గారావుతో పాటు మరో డ్రైవర్ నరశింహారావుకు గాయాలు కాగా 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్లు తనిఖీ

పర్చూరు: త్వరలో జరగబోయే ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు శాసనమండలి (గ్రాడ్యుయేట్ అండ్ టీచర్స్)ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ స్టేషన్లు తనిఖీ చేసినట్లు ఏఈఆర్వో, తహసీల్దారు నెహ్రూబాబు మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పట్టభద్రులకు రెండు చోట్లగా పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని చెప్పారు. పర్చూరు బొమ్మల సెంటర్ వెనుక వైపు గల యూపీ స్కూల్‌లో 109–గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్, 53–టీచర్స్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. వీరన్నపాలెం నవ్యభారత బుచ్చిపాపయ్య హైస్కూల్‌లో భూషాయపాలెం గ్రామం నుంచి వీరన్నపాలెం వరకు గల గ్రామాల గ్రాడ్యుయేట్ ఓటర్లకు 110–అను మరొక గ్రాడ్యుయేట్ పోలింగ్ స్టేషన్ ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ ఆర్.వాసుదేవరావు, సీనియర్ అసిస్టెంట్ ఎం .సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్ తప్పనిసరి

చీరాల టౌన్: మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని వైఎస్సార్ కాంతిపథం ఏపీఎం బీ.సుబ్బారావు సూచించారు. మంగళవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో వైఎస్సార్ వెలుగు పథకం మండల సమాఖ్య సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధిని పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రూపు విధిగా ప్రతినెల 10తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

కులంపేరుతో దూషించాడని ఫిర్యాదు

అద్దంకి రూరల్: తనను, తన భర్తను కులంపేరుతో దూషించాడని ఓమహిళ వీఆర్వోపై ఫిర్యాదు చేసింది. ఎస్సై నాగ వెంకటశివారెడ్డి వివరాల మేరకు.. సంతమాగులూరు మండలానికి చెందిన అల్లాడి నిర్మల బిందు తన భర్త రవికుమార్ గుంటూరు–కర్నూలు రహదారి పక్కన టీ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. మండలంలోని వెల్లలచెరువు గ్రామానికి చెందిన రామకృష్ణరావు సంతమాగులూరు వీఆర్‌వోగా పనిచేస్తున్నాడు. రోడ్డుమీదనున్న టీ షాపును తొలగించాలని చెప్పినా నిర్మల బిందు వినటంలేదని మంగళవారం టీషాపు వద్దకు వీఆర్‌వో వచ్చి ఆమె భర్తను కులం పేరుతో దూషించాడు. దీంతో వీఆర్‌వోపై నిర్మల బిందు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కరణం బలరాం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి

చీరాల: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ఎటువంటి పరిస్థితుల్లో కూడా నిర్లక్ష్యం వహించొద్దని ఎమ్మెల్యే కరణం బలరాం అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎక్కడ వరకు వచ్చాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. వేటపాలెం మండలం పొట్టిసుబ్బాయపాలెంలో నూతన కరెంట్ స్తంభాలు వేయాలని అధిచారులకు సూచించారు. అలానే లో వోల్టేజీ సమస్య పరిష్కరించి ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న విద్యుత్ పనులపై, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష జరిపారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్లు ఎక్కడ అవసరం ఉందో గుర్తించాలన్నారు. అవసరమైతే మండల పరిషత్‌లోని సాధారణ నిధులతో పాటు ఎమ్మెల్యే గ్రాంట్ ద్వారా అయినా పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసరావు, డీఈ నరసింహులు, పంచాయతీరాజ్ డీఈ శేషయ్య, ఎలక్ట్రికల్ ఈఈ సూర్యప్రకాష్‌రావు, వేటపాలెం ఎంపీడీవో శర్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మహిళల పక్షపాతి



కూకట్లపల్లిలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న చైతన్య

- గడప గడపకు మన ప్రభుత్వంలో శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య

బల్లికురవ: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి సంక్షేమ పథకాలతో మహిళ హృదయాల్లో చెరగని ముద్ర వేశారని రాష్ట్ర శాప్‌నెట్ ఛైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని కూకట్లపల్లి సచివాలయంలో మూడో రోజు మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు తీరుపై ప్రజలను మహిళలను చైతన్య అడిగి తెలుసుకున్నారు. పలువురు గత ప్రభుత్వ హయాంలో కోట్లు వెచ్చింది ఏర్పాటు చేసిన రక్షిత పథకం అలంకార ప్రాయమై మంచినీరందటం లేదన్నారు. సాంకేతిక లోపాలను సరిచేయించి నీరందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర కులాలకు చెందిన 45 ఏళ్ల నిండిన మహిళలకు వారి ఖాతాలకు నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. రాబోయే ఎన్నికల్లో కూడా సీఎంగా జగనన్న ఆశీర్వదించాలని చైతన్య కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, మండల ఉపాధ్యక్షుడు ఇప్పల వెంకట సుబ్బారెడ్డి, కెరాజుపాలెం సొసైటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారావు, స్థానిక నేతలు చింతల శ్రీనివాసరావు, ఇప్పల అంజిరెడ్డి, రామిరెడ్డి, టీ. విజయభాస్కర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, జానడీర్ సుబ్బారెడ్డి గుంటక నాగిరెడ్డి, గోగుల మూడి మల్లారెడ్డి, గోళ్ల ఏడుకొండల రెడ్డి వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాల లబ్ధి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న కరణం వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్

చీరాల: లబ్ధిదారుల ఇంటికి నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. మంగళవారం చీరాల పట్టణంలోని 9వ వార్డులోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, వాటిపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవరత్నాల పథకాలను అర్హులందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తికి జవాబుదారీగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన అన్ని హామీలను 95 శాతం మేర అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. సంక్షేమాన్ని చూడలేకనే ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి మూడేళ్లుగా ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, 9వ వార్డు కౌన్సిలర్ మల్లెల లలిత, మల్లెల రాజశేఖర్, వార్డు నాయకులు జి.సోని, దేట విజయ్, దేట రవి, దేట జోసఫ్, జి.విజయ్, కౌన్సిలర్లు గోలి స్వాతి, చుక్కా నాగలక్ష్మి, మించాల సాంబశివరావు, కె.యానాదిరావు, చీమకుర్తి బాలకృష్ణ, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, గొట్టిపాటి ఎబినేజర్, గోలి జగదీష్, ఆర్‌బికె చైర్మన్ కావూరి రమణారెడ్డి, కట్టా చంద్ర, మల్లి రామకృష్ణ, కాగితాల ప్రకాష్, చిలుకోటి శ్రీను, గోలి గంగాధర్, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

హైద్రాబాద్‌లో సంతమాగులూరు వ్యక్తి అరెస్ట్

అద్దంకి: కూరగాయల సంతల్లో దొంగతనాలు చేస్తున్న సంతమాగులూరుకు చెందిన వ్యక్తిని హైద్రాబాద్‌లోని ఎల్బీ నగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు.. సంతమాగులూరుకు చెందిన మేకల శ్రీనివాసరావు హైద్రాబాద్‌లోని కూరగాయల సంతల్లో దొంగతనాలు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఈ నెల 4న ఓ దేవాలయంలో పనిచేసే పూజారి సెల్‌ఫోన్ చోరీకి గురికాగా, దాన్ని మేకల శ్రీనివాసరావు దొంగిలించినట్లు పోలీసులు గుర్తించి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సమాచారం.

అనారోగ్యంతో ఉపసర్పంచ్ రాజీనామా

కారంచేడు: మండలంలోని జరుబులవారిపాలెం గ్రామ ఉపసర్పంచ్ బండారు సుధారాణి తన పదవికి రాజీనామా చేశారు. మంగళవారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆర్ రమేష్‌బాబుకు తన రాజీనామా పత్రం సమర్పించారు. తనకు కొంత ఆరోగ్యం సహకరించకపోడవంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాదాసు కుమారి, గ్రామ కార్యదర్శి జయప్రకాష్‌లు పాల్గొన్నారు.

ఎస్ఈబీ అధికారుల తనిఖీలు



వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల ఏఈఎస్ నరసింహారావు

అద్దంకి రూరల్: జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు అద్దంకి ఎస్ఈబీ పరిధిలో అద్దంకి, పంగులూరు, బల్లికురవ మండలాల్లో బాపట్ల ఎఈఎస్ జీ. నరసింహారావు ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సందర్భంగా ఆయన అద్దంకి ఎస్ఈబీ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ అనుమానిత ప్రాంతాల్లో, రెస్టారెంట్‌లో విస్తృతంగా తనిఖీలు చేసినట్లు చెప్పారు. ఎక్కడా ఇతర రాష్ట్రాలనుంచి వచ్చిన మద్యం పట్టుబడలేదన్నారు. డ్రగ్ ఫ్రీ ఆంధ్రాలో భాగంగా ప్రతి స్టేషన్ పరిధిలో ఎస్ఈబీ సిబ్బంది నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు. రెండు నెలల క్రితం అద్దంకి ఎస్ఈబీ సిబ్బంది కొరిశపాడులో పాండిచ్చేరి నుంచి వస్తున్న మద్యాన్ని పట్టుకున్నారని ఆ కేసులోని నిందితుడి విచారిస్తే సోమవారం అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెంలో లభించిన గోవా మద్యం వివరాలు తెలిసినట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాలనుంచి వస్తున్న మద్యాన్ని కొరిశపాడులో 175 బాటిళ్లు, పర్చూరులో 152 బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల ఎస్ఈబీ ఇన్స్‌స్పెక్టర్ సోమయ్య, పర్చూరు ఎస్సై శివరామప్రసాద్ అద్దంకి ఎస్ఈ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు



కొండమంజులూరులో రైతులతో మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి

వేటపాలెం: రైతులు తమ పంటల సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించుకోవాలని ఏవో అధికారి ఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. మంగళవారం చల్లారెడ్డిపాలెం–2 రైతుభరోసా కేంద్రం పరిధిలో వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా పొగాకు లద్దెపురుగు నివారణకు విషపు ఎర తయారీ వివరించారు. కార్యక్రమంలో సీపీఎం సీ దక్షిణామూర్తి, ప్రేమ రంజితం, సురేష్, స్వాతి, రామారావు, వినయ్, వినోద్, జ్యోతి రైతులు పాల్గొన్నారు.

జే.పంగులూరు: ఈ పంట నమోదుతో రైతులకు ఎంతో లాభం చేకురుతుందని ఏవో సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో మంగళవారం ఏవో మొక్కజొన్న పంటలను పరిశీలించారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులు

చీరాల: చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన పలు పరీక్షల్లో విద్యార్థులు అర్హత సాధించారు. ఇంటర్వ్యూల్లో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న సీఎస్సీ, ఈసీఈ, ఈఈఈ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం కారణంగా నియామకాలు తగ్గుతున్న పరిస్థితుల్లో తమ కళాశాల నుంచి విద్యార్థులు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులను విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఓడి షేక్ బషీరా, సౌజన్య, పద్మావతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాజీ షాహిద్, విద్యార్థులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మా క్లయింట్ బాపట్ల జిల్లా, ఇంకొల్లు మండలము, ఇడుపులపాడు గ్రామ కాపురస్తురాలు శ్రీమతి అంబటి లక్ష్మి సుజాత, భర్త తిరుపతి స్వామి ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియచేయునది ఏమనగా!

ఈ దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తులలో మా క్లయింటు ఆమెకు చట్టపరముగా రావల్సిన సగము వాటా కొరకు మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో O.S.No.140/2021 న ఇడుపులపాడు గ్రామ కాపురస్తురాలు మరియు మా క్లయింట్ అన్న లేట్ పంగులూరు నాగేశ్వరరావు భార్య భూలక్ష్మీపై పార్టిషన్ దావాను దాఖలు చేయగా సదరు దావా నిల్వలో ఉన్నది. అయితే సదరు భూలక్ష్మీ పై వాస్తవమును మరుగుపరచి తప్పుడు సంగతులతో, మోసపు మాటలతో షెడ్యూలు ఆస్తులపై లాలూచీ క్రయవిక్రయాలు, పరాధీనములు చేయుటకు ముమ్మర ప్రయత్నములు చేయుచున్నదని మా క్లయింట్‌కు రూఢీగా తెలిసినది. కావున ఎవరేని ఆమె మోసపు మాటలు నమ్మి షెడ్యూలు ఆస్తులపై ఎటువంటి లావాదేవీలు జరిపిననూ అవి చెల్లనేరవనియ్యీ, చట్టవిరుద్ధములనియ్యీ, నా క్లయింటును ఏ విధముగా బద్ధపరచజాలవనియ్యీ, గౌరవ కోర్టులో నిల్వలో వున్న దావాలో తీర్పుకు లోబడగలవనియ్యీ తెలుసుకోవలెను.

షెడ్యూలు: మొదటి ఐటం:- బాపట్ల జిల్లా – బాపట్ల డి.రి. ఇంకొల్లు స.రి. జె.పంగులూరు మండలం, పంగులూరు గ్రామము, సర్వేనంబరు – 404/1 – య.2.00 దానికి హద్దులు తూర్పు: చిలుకూరి కృష్ణారావు వగైరాల భూమి, దక్షిణం: పెంట్యాల శేషుకుమారి భూమి, పడమర: బాచిన తాతయ్య భూమి, ఉత్తరం: చిలుకూరి వీరరాఘవయ్య భూమి.

రెండవ ఐటం:- డిటో గ్రామము – సర్వేనంబరు.62– య.0.67 సెంట్ల భూమి దానికి హద్దులు తూర్పు: డొంక, దక్షిణం: రావూరి రామయ్య భూమి, పడమర: పెంట్యాల శేషుకుమారి భూమి, ఉత్తరం: గొల్ల రామయ్య భూమి.

మూడవ ఐటం: డిటో గ్రామము – సర్వే నంబరు.411 – పంగులూరు గ్రామ పంచాయితీ – మొదటి వార్డు 96 చ॥గ॥ స్థలం దానిలో డోరు నెంబరు 1–50/1గా గల డాబా యిల్లు దానికి హద్దులు, తూర్పు: గల్లి బజారు, దక్షిణం: బాచిన అంజయ్య, పడమర: పంచాయితి బజారు, ఉత్తరం : పెంట్యాల శేషుకుమారి.

నాల్గవ ఐటం:- డిటో గ్రామము – సర్వేనంబరు–411, పంగులూరు గ్రామ పంచాయితీ – మొదటి వార్డు –145.2 చ॥గ॥ స్థలం (డోరు నెంబరు 1–50/1 దగ్గరలో) దానికి హద్దులు, తూర్పు: పెంట్యాల శేషుకుమారి, దక్షిణం: ఎమ్.వీరయ్య, పడమర: చిలుకూరి అదెమ్మ, ఉత్తరం: రోడ్

వజ్రాల అంజిరెడ్డి, తాడికొండ ప్రసాద్‌బాబు, మారం శ్రీనివాసరావు
న్యాయవాదులు, అద్దంకి. సెల్: 98481 80604

అధికారుల తీరు మార్చుకోవాలి

- వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుబాబు

కారంచేడు: అధికారుల తీరు మార్చుకుని విధులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాన్నం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంను నిర్వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీశ్రీనివాసరావు గత ప్రభుత్వ పాలనలో జరిగిన అవినీతిపై విచారణ ఎంత వరకు వచ్చింది, దాని నివేదికలు కావాలని అడిగారు. ఆర్థిక సంఘం నిధులు, టాక్స్‌ల ద్వార వచ్చే నిధులు ఎక్కడికి పోతున్నాయో, జమలు, వాటి ఖర్చుల విషయంలోను అధికారులు నిగ్గుతేల్చాలని కోరారు. దీంతో ఎంపీపీ మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యురాలు అడిగిన ప్రశ్నలకు ఎంపీడీవో రమేష్ బాబు సమాధానంతో పాటు, చర్యలకు సిపార్సు చేయాలని సూచించారు. దగ్గుబాడు గ్రామ సర్పంచ్ రవీంద్రనాథ్‌ఠాగూర్ గ్రామంలో జరిగే రోడ్లు, అభివృద్ధి పనులు, ఉపాధి పనుల విషయంలో గ్రామ పంచాయితీకి సంబందిత అధికారులు కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. వాటర్‌ట్యాంక్, పైప్‌లైన్ నిర్మాణాలను చేపట్టాలని కో–ఆప్షన్‌మెంబర్ ముల్లా నూర్‌అహ్మద్ కోరారు. కారంచేడులో గడప గడపకు కార్యక్రమంలో తీసుకున్న నిర్ణయాల అమలులో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు ఎంపీడీవోను ప్రశ్నించారు. అన్ని శాఖల తీరుపై చర్చించి, అవసరమైన తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, సీడీపీఓ సుభద్రాదేవి, వైద్యాధికారులు జెస్సీరాణి, ద్రవంతి, షాలినీ, ఎంఈవో సత్యన్నారాయణ, ఏఓ శివనాగప్రసాద్, ఏపీఓ, పార్టీ మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, కారుమూడి సుబ్బారెడ్డి, యర్రం లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

చీరాల అర్బన్: పట్టణంలోని డీ–1 సెక్షన్ పరిధిలోని విద్యుత్ సర్వీసులను మంగళవారం విద్యుత్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. చీరాల డివిజన్ ఈఈ కే.సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో సిబ్బంది 35 బృందాలుగా విడిపోయి మొత్తం 2399 సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో అదనంగా లోడ్ వాడుతున్న 108 సర్వీసులను గుర్తించి వారికి రూ.3.91 లక్షల అపరాధ రుసుము విధించారు. అలానే విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న మూడు సర్వీసులను గుర్తించి వారికి రూ.60 వేలు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో విద్యుత్ విజిలెన్స్ ఈఈ టి.హైమావతి, చీరాల డీఈ టి.శ్రీనివాసరావు, వేటపాలెం డీఈ జె.శ్రీనివాసులు, పర్చూరు డీఈ రమేష్, 9 మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేటలో ఇంట్లో చోరీ

చీరాల: వేటపాలెం మండలం కొత్తపేటలోని ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. టూటౌన్ సీఐ సోమశేఖర్ వివరాల మేరకు.. కొత్తపేటలోని గ్యాస్ గొడౌన్ సమీపంలో ఆకుల మణి గత 29న హైద్రాబాద్‌లోని తన కూతురు ఇంటికి వెళ్లారు. మంగళవారం మణి ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించి ఆమెకు, పోలీసులకు సమాచారం అందించారు. సీఐ చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఇంటిలో ఉన్న 2 సవర్ల బంగారంతో పాటు 120 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రన్నరప్‌గా చీరాల పాలిటెక్నిక్ కాలేజీ



కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న చీరాల జట్టు

ఒంగోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ జూనియర్స్ విభాగంరన్నరప్‌గా చీరాల పాలిటెక్నిక్ కాలేజీ నిలిచింది. మంగళవారం ఒంగోలు జరిగిన ఫైనల్ మ్యాచ్ పేస్ పాలిటెక్నిక్ కాలేజీ, చీరాల పాలిటెక్నిక్ మధ్య జరిగింది. తొలుత బ్యాటింగ్ చేసిన చీరాల 6 వికెట్లు కోల్పోయి 66 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పేస్ జట్టు తొమ్మిది ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది. విజేతకు, రన్నరప్‌కు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ బహుమతులు అందించారు.